క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు. మూలస్థానేశ్వరాలయ చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు శ్రీధర్, దార్ల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఇంతియాజ్, గోగుల నాగరాజు, మైనార్టీ నేతలు హాజీ, మున్వర్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

16న ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు రూరల్: శాలివాహన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అంబాపురంలోని శాలివాహన కల్యాణ మండపంలో జూలై 16న అందజేయనున్నామని సంఘ జిల్లా కమిటీ సభ్యుడు నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చాటిన శాలివాహన విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసపత్రాలను అందజేయనున్నామని వివరించారు. పదో తరగతిలో 480, ఇంటర్మీడియట్‌లో 800కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ట్రంక్‌రోడ్డులోని మయూరి హోటల్ ఎదురుగా గల ఆర్కే ప్రింట్ పాయింట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్



జలదంకి: మండలంలోని వేములపాడు పరిసర ప్రాంతంలో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. వారి వద్ద నుంచి మూడు మోటార్ సైకిళ్లు, రూ. 2,600 నగదుతో పాటు కోళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పొంగూరుకండ్రిక సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో కదిరినేనిపల్లికి చెందిన ఒంగోలు శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మర్రిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూచిక బోర్డు ఢీకొని ఇద్దరికి గాయాలు



కొండాపురం: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మలుపు వద్ద అదుపు తప్పి సూచిక బోర్డును ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన భీమవరప్పాడు-సాయిపేట మధ్యన నల్లవాగు వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. రేణమాలకు చెందిన అల్లాభక్షు, ఖాజా భీమవరప్పాడు నుంచి రేణమాలకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబానికి చేయూత

చేజర్ల (సోమశిల): నిరుపేద కుటుంబానికి మన మైత్రి ఫౌండేషన్ సహాయ పడింది. అనంతసాగరం మండలం చిలకలమర్రికి చెందిన ముద్దిగాళ్ల వెంకటయ్య కుమారుడు తేజ కొద్ది కాలంగా కటిక పేదరిక జీవనం గడుపుతున్నాడు. ఇటీవల తేజ తల్లి అనారోగ్యంతో మరణించింది. తేజ కుటుంబానికి నివాసముండేందుకు ఇల్లు కూడా లేదు. ఎండకు, వానకు తడుస్తూ ఇబ్బంది పడుతుండేవారు. ఈ విషయాన్ని గమనించిన మైత్రి ఫౌండేషన్ సభ్యులు ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించారు. ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో ఆదివారం తేజ కుటుంబ సభ్యులు గృహ ప్రవేశం చేశారు. మన మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు మాట్లాడుతూ ఓ పేద కుటుంబానికి నీడ కల్పించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. సభ్యులు పచ్చ రాము,బోదేపల్లి శ్రీను పాల్గొన్నారు.



ఈమె సీహెచ్ చెంచమ్మ. నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురానికి చెందిన ఈమె గతంలో ఇందిరమ్మ పథకం కింద పక్కా ఇల్లు నిర్మించుకుంది. అందుకు సంబంధించి దాదాపు రూ.25 వేల వరకు రుణం చెల్లించాల్సి ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటీఎస్ పథకం కింద రుణాన్ని మాఫీ చేయడమే కాకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందజేశారని ఆమె సంతోషంగా చెబుతోంది.



ఈమె పేరు భాగ్యమ్మ. రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీకి చెందిన ఈమె 2006లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంది. అందుకు సంబంధించి దాదాపు రూ.25 వేల వరకు రుణం ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఓటీఎస్ స్కీం కింద ఎలాంటి నగదు వసూలు చేయకుండానే ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి అందజేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.



ఈమె పేరు ఏలూరు వెంకటరమణమ్మ. రామచంద్రాపురం గిరిజన కాలనీకి చెందిన ఈమె 2007లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంది. అందుకు సంబంధించి దాదాపు రూ.25 వేల వరకు రుణం ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి నగదు తీసుకోకుండా రుణ విముక్తి కల్పించి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసిందని ఆమె సంతోషంగా చెబుతోంది.



ఈమె పేరు అద్దూరు చెంచమ్మ. రామచంద్రాపురం గిరిజన కాలనీకి చెందిన ఈమె గతంలో ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకుంది. అందుకు సంబంధించి సుమారు రూ.25వేల వరకు రుణం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఓటీఎస్ స్కీం కింద ఒక్కరూపాయి తీసుకోకుండా రుణ విముక్తి కల్పించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందజేసిందని ఆమె ఆనందంగా చెబుతోంది.

ఓటీఎస్‌తో రుణ విముక్తి

జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం పేదలకు వరంగా మారింది. గతంలో రుణాలు పొంది ప్రభుత్వ, సొంత స్థలాల్లో పక్కాగృహాలు నిర్మించుకున్న పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓటీఎస్ కింద రుణ విముక్తి కల్పించారు. పక్కాగృహాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇంటి పట్టాలను అందజేసి సొంత ఆస్తి భరోసా కల్పించారు. దీంతో పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఓటీఎస్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌తో 2004 నుంచి 2018 వరకు ప్రభుత్వ పక్కాగృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులను రుణ విముక్తులను చేసింది. ఉచితంగా ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి సొంత ఆస్తి భరోసా కల్పించింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో రుణ సదుపాయాన్ని పొందే విధంగా చర్యలు తీసుకుంది.

3,200 మందికి లబ్ధి

ప్రభుత్వ గృహ లబ్ధిదారులకు రుణవిముక్తి కల్పించి సొంత ఆస్తి భరోసా కల్పించేందుకు గతేడాది సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఓటీఎస్ పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద పల్లెల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.15 వేలు,నగరాల్లో రూ.20 వేలు చెల్లించిన పక్కాగృహ లబ్ధిదారులకు రుణముక్తి కల్పించేలా చర్యలు తీసుకుంది. నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి ఒక్క రూపాయి నగదు తీసుకోకుండానే రుణవిముక్తి కల్పించి ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందజేసింది. బుచ్చిరెడ్డిపాళెం మండలంతో పాటు నగర పంచాయతీ పరిధిలో ఓటీఎస్ కింద 3,200 మందిని ఎంపిక చేయగా, 600 మంది రూ.10 వేలు, 320 మంది రూ.15 వేలు చెల్లించి రుణవిముక్తి పొందారు. మిగిలిన 2280 మంది లబ్ధిదారుల నుంచి ఒక్కరూపాయి నగదు తీసుకోకుండానే ప్రభుత్వం రుణ విముక్తులను చేసింది. ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పత్రాలను అందజేసి ఆస్తి భరోసా కల్పించింది.

సొంత ఆస్తి భరోసా

గత ప్రభుత్వాలు ఇందిరమ్మ ఇళ్లు, ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ ద్వారా అర్హులైన పేదలకు ఇళ్లను మంజూరు చేశాయి. ఈ గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం అందించే రాయితీని మినహాయించి మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు పదేళ్లలోపు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఎలాంటి రుణ బకాయిలను చెల్లించకపోవడంతో వారికి ఇళ్లపై హక్కు లభించలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశం లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సొంత ఆస్తిని కల్పించాలన్న ఉద్దేశంతో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీంను అమలు చేసి రుణవిముక్తులను చేసి సొంత ఆస్తి భరోసా కల్పించారు. తద్వారా ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణ సదుపాయం పొందే అవకాశాన్ని కల్పించారు.



ఓటీఎస్ కింద రుణ విముక్తి కల్పించి ఇల్లు

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బుచ్చిరెడ్డిపాళెం: వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ సిబ్బంది తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని దుకాణాల్లో ఆదివారం వారు తనిఖీలు నిర్వహించారు. భారీ స్థాయిలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు వ్యాపారులకు ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి

30లోగా పీఎం కిసాన్ ఈ–కేవైసీ చేయించుకోవాలి

కొడవలూరు: పీఎం కిసాన్ పథకం ఈ–కేవైసీ గడువు నెలాఖరుతో ముగియనున్నదని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 3,160 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,700 మంది మాత్రమే చేయించుకున్నారని చెప్పారు. మిగిలిన 460 మంది రైతులు నెలాఖరులోగా ఈ–కేవైసీ చేయించుకోవాలని కోరారు. వేలిముద్రలు పడని కారణంగా ఈ–కేవైసీ చేయించుకోని రైతుల కోసం ముఖ గుర్తింపు ద్వారా చేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిరైతు ఈ–కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈకేవైసీ చేయించుకోకుంటే పీఎం కిసాన్ 14వ విడత నిధులు పడవని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పుస్తకాలను బహూకరిస్తున్న దాతలు

వెంకటాచలం: స్థానిక గ్రంథాలయానికి నెల్లూరుకు చెందిన జగన్‌మోహన్‌రావు, కే రాధాకుమారి రూ.14వేల విలువైన 140 పుస్తకాలను ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఏ రేవతి మాట్లాడుతూ ప్రముఖ రచయితలు యండమూరి వీరేంద్రనాథ్, సూర్యదేవర రామ్మోహన్‌రావు, మల్లాది వెంకట కృష్ణమూర్తి, మధుబాబు, తదితర రచయితల నవలా సాహిత్య పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించడం సంతోషకరమని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

వెంకటాచలం: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని సెబ్ నెల్లూరు–2 సీఐ వీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సెబ్ నెల్లూరు–2 ఆధ్వర్యంలో చెముడుగుంటలోని నారాయణ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఉన్న రుగ్మతల్లో మాదకద్రవ్య వినియోగం తీవ్రమైనదని, కుటుంబాలు, సమాజానికి తీవ్రమైన హాని చేస్తుందని పేర్కొన్నారు. వాటిపై విద్యార్థి దశ నుంచే పూర్తి స్థాయిలో అవగాహన కలిగి దూరంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో ఎస్‌ఐ శకుంతలదేవి, కళాశాల ప్రిన్సిపల్ విశ్వజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన అతిథి గృహాలు



శిథిలావస్థకు చేరిన ముత్తుకూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం



శిథిలావస్థకు చేరిన బ్రహ్మదేవిలోని ఇరిగేషన్ అతిథిగృహం

ముత్తుకూరు: మండలంలో బ్రిటిష్ కాలం నాటి అతిథిగృహాలు శిథిలమై కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ముత్తుకూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం పూర్తిగా శిథిలమైంది. ఈ అతిథిగృహం చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయి విషకీటకాలకు ఆవాసాలయ్యాయి. అలాగే బ్రహ్మదేవి సమీపంలోని ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం – అతిథిగృహం కూడా శిథిలమైంది. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది.

కోలాహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. బద్వేల్, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది పోటీలను తిలకించేందుకు తరలివచ్చారు. ఈ పోటీల్లో వైఎస్సార్ జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి ఎడ్లు మొదటి బహుమతి గెలుచుకోగా, కేతిగుంట మాజీ సర్పంచ్ మందాడి శ్రీనివాసులు నాయుడు రూ.25,016 ప్రోత్సాహ బహుమతిని మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రెండో బహుమతిని వైఎస్సార్ జిల్లా గుంతపల్లికి చెందిన మోదేపల్లి వెంకట సుబ్బయ్య ఎడ్లు గెలుచుకోగా పొంగూరు సర్పంచ్ అన్నపురెడ్డి రమణమ్మ, రామిరెడ్డి దంపతులు రూ.20 వేలు నగదు ప్రోత్సాహకాన్ని విజేతలకు అందజేశారు. మూడో బహుమతిని వైఎస్సార్ జిల్లా గోపవరానికి చెందిన విమలయ్య ఎడ్లు గెలుచుకోగా గంగపాళెంకు చెందిన తంగేడుపల్లి శ్రీనివాసులు రూ.15 వేల నగదు ప్రోత్సాహకాన్ని విజేతలకు అందించారు. మర్రిపాడు అనంతసాగరం, అనుమసముద్రంపేట ఎస్సైలు విశ్వనాథరెడ్డి, సంతోష్‌రెడ్డి, నరేష్ తమ సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్తర నక్షత్రం సందర్భంగా శ్రీలక్ష్మి అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాడా రాధయ్య, కామేశ్వరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పరామర్శ



సురేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: వరిగొండ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఒబ్బారెడ్డి సురేష్‌రెడ్డిని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. గత కొద్దిరోజులుగా సురేష్‌రెడ్డి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కాకాణి ధనలక్ష్మీపురంలోని సురేష్‌రెడ్డి నివాసానికి చేరుకుని ఆయన్ని పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు, రేపు తల్లిదండ్రుల సమావేశాలు

కొడవలూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమ, మంగళవారాల్లో విధిగా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని ఎంఈఓ జీ వసంతకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి ఇంకా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించాలన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు హెచ్‌ఎంలు సమావేశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిర్వహించాలని కోరారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీలు

కొడవలూరు: కౌలు రైతులకు పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు(సీసీఆర్‌సీ)లు మంజూరు చేస్తున్నామని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు మాత్రమే సీసీఆర్‌సీలకు అర్హులలని చెప్పారు. సీసీఆర్‌సీ పొందిన రైతులు మాత్రమే ప్రభుత్వం అందజేసే రైతు భరోసా పెట్టుబడి సాయం పొందేందుకు అర్హులవుతారని చెప్పారు. కౌలు రైతులు ఆర్‌బీకేల్లోని వీఏఏ లేదా వీఆర్వోను సంప్రదించి సంబంధిత పత్రాలను సమర్పించి సీసీఆర్‌సీ పొందాలని సూచించారు.

పుస్తకాల అందజేత



నెల్లూరు (టౌన్): బాలాజీనగర్‌లోని అంధుల పాఠశాలకు బియ్యం, పుస్తకాలు, పెన్నులను బీఈఎస్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉచ్చి భార్గవ్‌రామ్ మాట్లాడారు. తమ సంస్థ ద్వారా ఉద్యోగావకాశాలు పొందిన పూర్వ విద్యార్థులు సాయం చేయడాన్ని అభినందించారు. సాఫ్ట్‌వేర్ నిపుణులు పూజిత, ఇమ్రాన్, ఉద్యోగులు షంషీర్, మోనీష్, మస్తాన్, తేజస్విని, అరుణ, అశ్విని, లాలస, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై విస్తృత అవగాహన



జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన సేవలను తెలుసుకోవాలన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారిని గుర్తించాలన్నారు. జూలై 1న సచివాలయాల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపులో సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నెల్లూరు(బృందావనం): ఏవీకే ఫౌండేషన్ వార్షికోత్సవ వేడుకలను నగరంలోని పురమందిరంలో ఆదివారం నిర్వహించారు. తొలుత న్యూ రాజ్యలక్ష్మీ హాల్, శుభమస్తు షాపింగ్ మాల్ వ్యవస్థాపకులు బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మను స్మరిస్తూ కళానీరాజనాన్ని నిర్వాహకుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో సమర్పించారు. పాటలు, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. తెలుగు భాషకు ఎనలేని సేవలందిస్తున్న పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్‌ను సత్కరించి కళాపోషకుడు బిరుదును ప్రదానం చేశారు. ప్రవీణ్ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరిని నిర్వహించారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, మాజీ కౌన్సిలర్ లలితారామ్, బలరామయ్యనాయుడు, ప్రదీప్, రియాజ్‌బాషా, రవికుమార్, మురళీకృష్ణ, సత్యం రవికుమార్, రఘురామిరెడ్డి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ధ్వజారోహణ, చప్పరోత్సవం, శేషవాహనసేవను వేడుకగా ఆదివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆలయ వ్యవస్థాపకులు వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజమ్మ దంపతులు, చెన్నైకి చెందిన విస్సా కశ్యప్, లలిత దంపతులు వ్యవహరించారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశం



డాక్టర్ రాజశేఖర్‌కు సత్కారం

నెల్లూరు(బృందావనం): ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నేత్రవైద్య నిపుణుడు రాజశేఖర్ హాజరయ్యారు. కంటి రెటీనా, శస్త్ర చికిత్సలు, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం రాజశేఖర్, జూన్‌లో జన్మదినాన్ని జరుపుకొంటున్న సభ్యులను సత్కరించారు. తొలుత భగవద్గీతను పఠించారు. అసోసియేషన్ నెల్లూరు అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దెపల్లి సుబ్బారావు, సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్లు, శేషయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు ఉపయోగం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో ఉపయోగమని సెంట్రల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరవస్తు నాగసాయిసూరి పేర్కొన్నారు. దర్గామిట్టలోని సెయింట్ జోసఫ్స్ నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని వియానీ హోమ్, పీఎంపీ అసోసియేషన్, భగవాన్ మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్, అద్భుత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాదాపు 450 మందికి వైద్య, రక్త పరీక్షలు చేసి మందులను అందచేశారు. అనంతరం ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, వియానీ హోమ్ సిస్టర్ రూబియా, రూడ్స్ చైర్మన్ రసూల్, అద్భుత ఫౌండేషన్ నిర్వాహకులు సాల్మన్, కోరేష్, మహావీర్ జైన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు జవాన్మల్‌జైన్, పీఎంపీలు వేణుగోపాల్, శేషయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.